ప్రాంతీయ క్రీడా పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

ఇండోర్ స్టేడియంను పరిశీలించి క్రీడా విద్యార్థులతో ముచ్చటిస్తున్న కలెక్టర్

కొత్తపల్లి, ఆగస్టు 17 : మానేరు తీర సమీపంలోని ప్రాంతీయ క్రీడా పాఠశాలను కలెక్టర్ పమేలా సత్పతి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి తరగతి గదిని పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయుల కొరత ఉందని విద్యార్థులు కలెక్టర్‌కు తెలియజేయగా త్వరలోనే సమస్య పరిష్కారం చేస్తానన్నారు. పాఠశాలకు సంబంధించి లైబ్రరీ పుస్తకాలు, ఇతర ఏ అవసరం ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే తక్షణమే గ్రాంట్ విడుదల చేస్తానన్నారు. విద్యార్థులకు కావాల్సిన క్రీడా సామగ్రిని కొనుగోలు చేయాలని డీవైఎస్‌వోకు సూచించారు. క్రీడా విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలన్నారు. కలెక్టర్ వెంట అధికారులు, ఉపాధ్యాయులు, కోచ్‌లు ఉన్నారు.

పని చేసే చోటే మన్ననలు పొందాలి

ఎంపీడీవో కృష్ణప్రసాద్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ

శంకరపట్నం, ఆగస్టు 17: ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులు ఎక్కడైతే పని చేస్తారో అక్కడే పదుగురి మన్ననలు పొందేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో బదిలీపై వెళ్లిన, కొత్తగా విధుల్లో చేరిన అధికారులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై బదిలీపై వెళ్లిన ఎంపీడీవో శ్రీవాణి, సూపరింటెండెంట్ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ సదాశివరెడ్డితో పాటు 16 మంది పంచాయతీ కార్యదర్శులను ఘనంగా సన్మానించారు. అలాగే కొత్తగా వచ్చిన ఎంపీడీవో గోల్కొండ కృష్ణప్రసాద్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగులు అంకిత భావంతో చేస్తే గుర్తింపు అదే వస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీవో శారద, మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, అధికారులు, ఉద్యోగులు, కొత్తగా చేరిన పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది, నాయకులు, తదితరులు ఉన్నారు.

వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

గన్నేరువరం, ఆగస్టు 17: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. గుండ్లపల్లి రైతు వేదికలో సేవా యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం, హెల్త్ క్యాంప్‌ను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా పలువురు యువకులు రక్తదానం చేశారు. ఏవో కిరణ్మయి, నాయకులు బేతేల్లి రాజేందర్‌రెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలి: సీపీఐ జిల్లా కార్యదర్శి

హుజూరాబాద్ టౌన్, ఆగస్టు 17: ఎలాంటి షరతులు లేకుండా ఈనెల 31లోగా ప్రతి రైతుకూ రూ.2లక్షల రుణ మాఫీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. రుణమాఫీ పూర్తి స్థాయిలో రైతులకు అందలేదన్నారు. ఎస్సారెస్పీ కెనాల్‌పై ఆధారపడ్డ రైతులు ఇంకా దుక్కిదున్నలేదన్నారు. సాగు నీరు అందక గోసపడుతున్న రైతన్నలకు క్రాప్ హాలీడే ప్రకటించి, ఎకరానికి రూ.50వేల ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. డబుల్ బెడ్రూం ఇండ్లను సెప్టెంబర్ 15లోగా లబ్ధిదారులకు అందించాలన్నారు. లేకుంటే.. తామే స్వయంగా పేదలతో వెళ్లి ఆక్రమించుకుంటామని హెచ్చరించారు. ఈ నెల 20న హుజూరాబాద్‌లోని మధువని గార్డెన్‌లో నిర్వహించే సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశానికి కార్యకర్తలు, ప్రజలు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్ కుమార్, బోయిని అశోక్, మండల కార్యదర్శి గోవింద్, రవి నాయక్, చాంద్ పాషా, రాజు, రాములు, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేశ్ పాల్గొన్నారు.

మొలంగూర్‌ను విడగొట్టవద్దు

శంకరపట్నం, ఆగస్టు 17 : మొలంగూర్ గ్రామాన్ని మూడు గ్రామ పంచాయతీలుగా విభజించవద్దని యువజన సమితి రాష్ట్ర కార్యదర్శి మోరె గణేశ్ శనివారం డీఆర్‌వోకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం మొలంగూర్ గ్రామ విభజనను విరమించుకుని, ఖిల్లా అభివృద్ధికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిపారు.

ముగిసిన ఎన్‌సీసీ శిక్షణ శిబిరం

హుజూరాబాద్ టౌన్,ఆగస్టు 17: సింగాపూర్‌లో గల కిట్స్ కాలేజీలో శనివారం ఎన్‌సీసీ శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమం అట్టహాసంగా జరిగింది. ఎన్‌సీసీ కెడెట్లు ఆటపాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా కమల ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే.శంకర్‌ను కమాండింగ్ ఆఫీసర్ డేనియల్ ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సుబేదార్ మేజర్ సాగర్ సింగ్, అసోసియేట్ ఎన్‌సీసీ అధికారులు శ్రీలత, మహేందర్ రెడ్డి, శ్రీనివాస్, ప్రశాంత్, మంగమ్మ, ఎన్సీసీ స్టాఫ్, ఎన్‌సీసీ కెడెట్లు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి సన్మానం

వీణవంక, ఆగస్టు 17: బొంతుపల్లి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వర్తించి బదిలీపై వెళ్లిన జానపట్ల అనితను శనివారం గ్రామ పంచాయతీలో మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. నూతనంగా విధుల్లో చేరిన పంచాయతీ కార్యదర్శి రజితను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచులు చదువు జితేందర్‌రెడ్డి, బావు సంపత్, నాయకులు బావు నాగయ్య, గుర్రాల వెంకట్‌కుమార్, చదువు నర్సింహారెడ్డి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

★కరీంనగర్ హైవే ఫేస్ ఫేసింగ్‌కి DTCP, ఓపెన్ ప్లాట్స్, బెంగళూరు హైవేకి, అతి దగ్గరలో అతి తక్కువ ధరలకే ప్లాట్స్ అమ్మబడును. బ్యాంక్ లోన్ Available, ఫోన్: 8885731233, 9948033142.
NT- 326217

LAND FOR SALE

★6.5 Acres Agriculture Land for Sale at Uddemarri (V), Mudichintalapalli (M), Medchal-Malkajgiri Dist., 9 Kms. from Shamirpet to Keesara Main Rd., Clear Title, Brokers excuse. Ph: 9542421000, 9848016513.
NT-326630

WANTED

jobs Apply Now!

★కరీంనగర్ జిల్లా సిర్పూర్‌లో పని చేయడానికి Ex Service Men సెక్యూరిటీ సిబ్బంది కావలెను. నెలకు జీతం: 22,000/- నుండి 35,000/- వరకు, వయస్సు: 50 సం॥లోపు. Trained సెక్యూరిటీ సిబ్బంది కావలెను. నెలకు జీతం: 19,000/- నుండి 26,000/- వరకు, అర్హత: 10వ తరగతి నుండి డిగ్రీ వరకు. బ్యాచిలర్ వసతి కలదు. వయస్సు: 20-40 సం॥లోపు. ESI, PF కలదు. హైదరాబాద్‌లో పని చేయడానికి ఫీల్డ్ ఆఫీసర్లు కావలెను. జీతం: 25,000/- + పెట్రోల్. సెల్ నెం: 8341038715 / 9848328701 / 8919606707.
NT-98210

WANTED

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-325790-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 9182 777 571
9182 777 189

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న వైద్యులు, మెడికోలు

ధర్నాలో పాల్గొన్న మహిళా వైద్యులు

జిల్లా వ్యాప్తంగా నిలిచిన ఓపీ సేవలు

- కలెక్టరేట్ ఎదుట ధర్నాకు భారీగా తరలివచ్చిన వైద్యులు, మెడికోలు
- 3 గంటల పాటు కలెక్టరేట్ వద్ద స్తంభించిన రాకపోకలు

విద్యానగర్, ఆగస్టు 17: కోల్‌కతాలోని ఆర్జీకర్ మెడికల్ కళాశాలలో డ్యూటీ డాక్టర్(వైద్య విద్యార్థిని)పై లైంగిక దాడి, హత్యను ఖండిస్తూ శనివారం ఉదయం 10 నుంచి ఒంటి గంట వరకు కరీంనగర్ ఐఎంఏ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట రెండు వేల మంది వైద్యులు ధర్నా చేశారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ దేశ వ్యాప్త ఆందోళనలో భాగంగా జిల్లాలో శనివారం ఉదయం 6 నుంచి ఆదివారం ఉదయం 6 గంటల వరకు ఓపీ సేవలు నిలిపివేసి నిరసన చేపట్టారు. ధర్నాతో 3 గంటల పాటు కలెక్టరేట్ వద్ద రాకపోకలు స్తంభించాయి. కాగా, జిల్లా దవాఖానలో గంటపాటు వైద్య సేవలు నిలిపివేసి వైద్యులు, సిబ్బంది నిరసన తెలిపారు. ప్రైవేట్ హాస్పిటళ్లలో మాత్రం పూర్తి స్థాయిలో ఓపీ సేవలు నిలిచిపోవడంతో రోగులు కొంతమేరకు ఇబ్బందులు పడ్డారు. అత్యవసర వైద్య సేవల కోసం కొంతమంది ప్రభుత్వ దవాఖానకు వెళ్లారు. కలెక్టరేట్ ఎదుట జరిగిన ధర్నాలో ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రాంకిరణ్, డాక్టర్ వెంకట్‌రెడ్డి, సీనియర్ వైద్యులు బీఎన్ రావు, రఘురామన్, విజయమోహన్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, రమణాచారి, ఎనమల్ల నరేశ్, చిట్టుమల్ల ప్రదీప్, దాసరి శ్రీనివాస్, రంజిత్ కుమార్, సురేశ్, రాజుముల్క, అనిల్, వెంకటేశ్వర్లు, శ్రీలత, ఆది శ్రీదేవి, రత్నమంజరి, ఎనమల్ల శ్రీదేవి, బంగారి రజినీ ప్రియదర్శిని, మెడికల్ కౌన్సిల్ మెంబర్ బండారి రాజ్‌కుమార్, నయని, చల్మెడ, ప్రతిమా వైద్య కళాశాలల వైద్యులు, మెడికోలు, మెడికల్ రిప్‌లు పాల్గొనగా, న్యాయవాదులు, ఉపాధ్యాయులు సంఘీభావం ప్రకటించారు.

జమ్మికుంట/మానకొండూర్/తిమ్మాపూర్, ఆగస్టు 17: కోల్‌కతా హత్యాచార ఘటనను నిరసిస్తూ.. జమ్మికుంట పట్టణంలో ట్రస్మా, ఐఎంఏ ఆధ్వర్యంలో స్థానిక తెలంగాణ చౌక్ వద్ద ఆందోళన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మానవహారం చేశారు. కార్యక్రమంలో ట్రస్మా నాయకులు డాక్టర్ పుల్లూరి సంపత్‌రావు, ముసిపట్ల తిరుపతిరెడ్డి, సుధాకర్‌రావు, ప్రతాప్‌రెడ్డి, రామస్వామి, బెన్ని, సునీల్, రమణారెడ్డి, వరుణ్‌రెడ్డి, ఐఎంఏ నాయకులు తిరుపతయ్య, శ్రీకాంత్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, సురేశ్, కిశోర్, మురళి తదితరులు పాల్గొన్నారు. తిమ్మాపూర్ పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది స్టైత్‌డౌన్ నిర్వహించి, ఓపీ సేవలు నిలిపివేసి నిరసన వ్యక్తం చేశారు. పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రణవ్, సిబ్బంది పాల్గొన్నారు. పల్లె దవాఖానలో వైద్యురాలు జవేరియా ఇమ్రోజ్ కండ్లకు నల్లరిబ్బన్ కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. మానకొండూర్ పీహెచ్‌సీ ఎదుట వైద్య సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. వైద్యాధికారి సౌమ్య, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్యుల ప్రాణాలకే రక్షణ లేదు

ప్రాణాలు కాపాడే వైద్యుల ప్రాణాలకే రక్షణ లేకుండా పోయింది. 36 గంటల పాటు ఏకధాటిగా డ్యూటీ చేస్తున్న వైద్యురాలిని అత్యంత కిరాతంగా హత్య చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. డ్యూటీ చేస్తున్న దవాఖానలోనే రక్షణ లేకపోతే ఇక బయట ఎలా రక్షణ ఉంటుంది. ఇప్పటికైనా ప్రభుత్వాలు మహిళలకు ప్రత్యేక రక్షణ చట్టాలు తేవాలి.

- డాక్టర్ చిట్టుమల్ల ప్రదీప్‌కుమార్

ఫాస్ట్ ట్రాక్ ఏర్పాటు చేసి ఉరి శిక్ష వేయాలి

ఈ కేసులో ప్రభుత్వం ఫాస్ట్ ట్రాక్ ఏర్పాటు చేసి కేసును త్వరితగతిన ఛేదించి నిందితులకు ఉరిశిక్ష వేయాలి. ఈ కేసులో ఎంతటి వారున్నా వారిని వదిలిపెట్టవద్దు. ఈ సమ్మె ఒకరోజుతోనే పూర్తి కాదు. దీనిపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే నిరంతరంగా కొనసాగిస్తాం. దిశ, నిర్భయ చట్టాలున్నా నిందితుల్లో భయం లేకుండా పోయింది. ప్రభుత్వాలు చట్టాలను కఠినతరం చేయాలి.

- డాక్టర్ విజయమోహన్‌రెడ్డి

జ్ఞాపకాలను పదిలం చేసేది ఫొటో: మేయర్ సునీల్‌రావు

కార్పొరేషన్, ఆగస్టు 17: అందమైన జ్ఞాపకాలు, తియ్యటి అనుభూతులు, మధుర ఘట్టాలు, వెలకట్టలేని దృశ్యాలను పదికాలాల పాటు పదిలంగా మన కళ్ల ముందు ఉంచేదే ఫొటోగ్రఫీ అని మేయర్ యాదగిరి సునీల్‌రావు పేర్కొన్నారు. స్థానిక టవర్‌సర్కిల్‌లో కరీంనగర్ ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ దినోత్సవం ఘనంగా జరిగింది. నగర మేయర్ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై ఫొటో కెమెరా పితామహుడు లూయిస్ డాగ్యురే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఫొటోగ్రఫీ రంగంలో వచ్చిన గణనీయ మార్పులు గుర్తు చేసుకున్నారు. పలువురు ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

నీటిపారుదల శాఖ ఎస్‌ఈగా రమేశ్

తిమ్మాపూర్, ఆగస్టు17: నీటిపారుదల శాఖ కరీంనగర్ సర్కిల్-2 ఎస్‌ఈగా పీ రమేశ్ ఎల్‌ఎండీలోని కార్యాలయంలో శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఎల్ఎండీలోని ఇరిగేషన్ సర్కిల్-1లో ఈఈగా పని చేస్తున్న ఆయనకు ఉద్యోగోన్నతి కల్పిస్తూ సర్కిల్-2 ఎస్‌ఈగా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి రాహుల్ బొజ్జా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎల్ఎండీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే అభినందనలు తెలిపారు.

నూతన ఎంపీవోల బాధ్యతల స్వీకరణ

జమ్మికుంట/హుజూరాబాద్ రూరల్/ చిగురుమామిడి, ఆగస్టు17: జమ్మికుంట మండల వ్యవసాయ అధికారిగా షేక్ ఖాదర్ హుస్సేన్, హుజూరాబాద్ మండల ఏవోగా చాడ భూమిరెడ్డి, చిగురుమామిడి మండల వ్యవసాయ అధికారిగా రాజుల నాయుడు శనివారం వారి కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు. అలాగే ముల్కనూర్ ఏఈవోగా ఆకుల ప్రణయ్ బాధ్యతలు చేపట్టారు.

కొత్తపల్లిలో చికున్ గున్యా కేసు

తిమ్మాపూర్, ఆగస్టు 17: కొన్నేండ్ల నుంచి పత్తాలేని చికెన్ గున్యా కేసు మండలంలోని కొత్తపల్లిలో చాలాకాలం తర్వాత నమోదు అయింది. కొత్తపల్లి గ్రామానికి చెందిన ఓ ఉద్యోగికి తీవ్ర జ్వరం రావడంతో పరీక్షలు చేయించుకోగా.. చికున్ గున్యా అని తేలింది. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉండగా, అప్రమత్తమైన అధికారులు గ్రామానికి వెళ్లి సర్వే చేశారు. డీఎంహెచ్‌వో ఉమా, మండల వైద్యాధికారి ప్రణవ్, వైద్యురాలు జవేరియా చికున్ గున్యా బాధితుడి ఇంటికి వెళ్లి వివరాలు తెలుసుకున్నారు. సిబ్బందితో పరిసరాలు పరిశుభ్రం చేయించారు. పంచాయతీ కార్యదర్శి అనిల్, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ సమస్యలను పరిష్కరించాలి

తెలంగాణచౌక్,ఆగస్టు17: సీనియర్ సిటిజన్స్ ఎదుర్కొంటున్న సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కరీంనగర్ జిల్లా సీనియన్ సిటిజన్స్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సముద్రాల జనార్దన్ రావు డిమాండ్ చేశారు. నగరంలోని ప్రెస్ భవనంలో శనివారం విలేకరుల సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులతో కలిసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లాలో మెయింటనెన్స్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ పేరెంట్స్, సీనియన్ సిటిజన్స్ యాక్ట్ అమలు కావడం లేదని తెలిపారు. మూడు నెలలకోసారి జిల్లా స్థాయిలో సమీక్షా సమావేశం నిర్వహించాల్సి ఉండగా, సంవత్సరానికి ఒక్కసారి కూడా జరుగడం లేదన్నారు. సీనియన్ సిటిజన్స్ గౌరవ ప్రదంగా జీవించడానికి భద్రత కల్పించాలని కోరారు.

రౌండ్ టేబుల్ సమావేశం విజయవంతం చేయాలి

తెలంగాణచౌక్, ఆగస్టు 17: హనుమకొండలోని ప్రెస్ క్లబ్‌లో ఈ నెల 25న నిర్వహించనున్న ఆటో యూనియన్ల రాష్ట్ర స్థాయి జేఏసీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ పిలుపునిచ్చారు. నగరంలోని కరీంనగర్ ఆటో కార్మిక సంక్షేమ సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన ఆటో కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆటో కార్మికుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి రూ.వెయ్యి కోట్లను కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర స్థాయి సమావేశంలో భవిష్యత్ కార్యాచరణ గురించి చర్చిస్తామన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షుడు రాజేందర్, సంపత్‌పటేల్, మహేందర్ పాల్గొన్నారు.

అసౌకర్యాల మధ్య వారసంత

గంగాధర, ఆగస్టు 17 : మండల కేంద్రంలో ప్రతి శనివారం నిర్వహిస్తున్న వార సంత అసౌకర్యాల మధ్య కొనసాగుతున్నది. వారసంత వేలం ద్వారా ప్రతి యేడాది కోటి రూపాయలకు పైగా ఆదాయం వస్తున్నా, సౌకర్యాలు కల్పించడంలో మాత్రం అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వ్యాపారం చేసుకోవడానికి సరిపడినంత స్థలం లేకపోవడంతో వ్యాపారులు, రైతులు రోడ్డు పక్కన క్రయవిక్రయాలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వారసంతలో సౌకర్యాలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

ఆసీఫ్‌నగర్ పాఠశాలలో నో బ్యాగ్ డే

కొత్తపల్లి, ఆగస్టు 17 : ఆసీఫ్‌నగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడో శనివారాన్ని పురస్కరించుకొని నో బ్యాగ్ డే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా విద్యార్థులు ఎవరూ బ్యాగులు, పుస్తకాలు పాఠశాలకు తీసుకురాలేదు. ఉపాధ్యాయులు సబ్జెక్టుల వారీగా పిల్లలకు ఆటలు ఆనందం ద్వారా విజ్ఞానం అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు శివ కుమార్, రాజేంద్రప్రసాద్, ఏంజలీన్, గంగాచారి, ప్రతిభా రాణి, నాగవేణి, హరికృష్ణ శర్మ, శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

గీత కార్మికులకు శిక్షణ

మానకొండూర్ రూరల్, ఆగస్టు 17: కాటమయ్య రక్షణ కవచం (సేఫ్టీ మోకు)పై శనివారం మండలంలోని శ్రీనివాస్‌నగర్ ఎల్లమ్మ ఆలయం సమీపంలోని తాటి వనంలో ఎక్సైజ్ సీఐ సాయిబాబా, ఎస్ఐ శ్రీకాంత్ ఆధ్వర్యంలో గీతకార్మికులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సేఫ్టీ మోకును ఉపయోగించే విధానం, మెళకువలు నేర్పించారు. కార్యక్రమంలో సర్వాయి పాపన్న మోకు దెబ్బ గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మ్యాడగోని బుచ్చయ్య గౌడ్, గౌడ సంఘం నాయకులు, కులస్తులు, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు ధ్రువీకరణకు 20 నుంచి ఇంటింటి సర్వే

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి

కలెక్టరేట్, ఆగస్టు 17: ఓటరు ధ్రువీకరణ కోసం ఈనెల 20 నుంచి ఇంటింటి సర్వే చేపట్టనున్నట్లు రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి.సుదర్శన్‌రెడ్డి తెలిపారు. ఓటరు జాబితా సవరణ 2025పై శనివారం జిల్లా కలెక్టర్‌తో హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఓటరు నమోదు ప్రక్రియపై అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలని, అధికారులకు సూచించారు. ఈనెల 20 నుంచి అక్టోబర్ 28వరకు ప్రీ రివిజన్ నిర్వహించి, అక్టోబర్ 29న ముసాయిదా ఓటరు జాబితా విడుదల చేయాలని ఆదేశించారు. నవంబర్ 28వరకు జాబితాపై ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరించాలని, రెండు శనివారాలు, ఆదివారాలు ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలన్నారు. ఈఏడాది డిసెంబర్ 24లోగా అభ్యంతరాలు, ఓటరు క్లయిమ్స్ పూర్తి స్థాయిలో పరిష్కరించి జనవరి 6, 2025న తుది ఓటరు జాబితా రూపొందించాలని స్పష్టం చేశారు. ఆగస్టు 20 నుంచి అక్టోబర్ 18 వరకు బూత్ స్థాయి అధికారులు పోలింగ్ కేంద్రాల వారీగా ఇంటింటికి తిరుగుతూ ఓటరు ధ్రువీకరణ చేపట్టాలన్నారు. జాబితాలో ఉండే పాత ఫొటోలు తొలగించి, ఓటర్ల కొత్త ఫొటోలు సేకరించి అప్‌లోడ్ చేయాలని సూచించారు. 2025 జనవరి 1 నాటికి 18ఏళ్లు నిండే ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదు చేయాలన్నారు. అక్టోబర్ 19 నుంచి 28 వరకు కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియలో భాగంగా దరఖాస్తు చేసుకున్న వారికి ఓటు హక్కు కల్పిస్తూ, ముసాయిదా జాబితా రూపొందించాలన్నారు. 1500 ఓటర్లకు మించి ఉన్న పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ చేయాలని, అవసరమైన చోట నూతన పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదనలు అందజేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫామ్ 8 దరఖాస్తులు సాధ్యమైనంత త్వరలో పరిష్కరించాలన్నారు. సమావేశంలో కలెక్టర్ పమేలా సత్పతి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు ప్రపుల్ దేశాయ్, లక్ష్మీకిరణ్, శిక్షణ కలెక్టర్ అజయ్ యాదవ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో రాఖీ వేడుకల్లో పాల్గొన్న చిన్నారులు

హుజూరాబాద్ రూరల్: తుమ్మనపల్లి శివారులోని ఏకశిలా పాఠశాలలో సహచర విద్యార్థులకు రాఖీలు కడుతున్న చిన్నారులు

విద్యాలయాల్లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు

కమాన్‌చౌరస్తా/ హుజూరాబాద్ రూరల్/ హుజూరాబాద్ టౌన్/ రామడుగు /గంగాధర/ తిమ్మాపూర్/ మానకొండూర్/చిగురుమామిడి, ఆగస్టు 17: జిల్లా వ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో శనివారం విద్యార్థులు ముందస్తు రక్షాబంధన్ వేడుకలు జరుపుకొన్నారు. నగరంలోని భగత్‌నగర్‌లో గల వివేకానంద విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థినులు స్వయంగా, సృజనాత్మకంగా తయారు చేసిన రాఖీలను సహచర విద్యార్థులకు కట్టి, స్వీట్లు పంచుతూ సందడి చేశారు. వేడుకల్లో విద్యాసంస్థల చైర్మన్ కొమురయ్య, పాఠశాల ప్రిన్సిపాల్ మిథున్ జే మిస్త్రి, ఏవో తుంగాని సంపత్, వైస్ ప్రిన్సిపాల్ సాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పద్మనగర్‌లోని పారమిత హెరిటేజ్ పాఠశాలలో చిన్నారులు స్వయంగా తయారు చేసిన రాఖీలను కట్టుకున్నారు. రాఖీ ప్రాశస్త్యాన్ని తెలిపే నాటికను చిన్నారులు చూడముచ్చటగా ప్రదర్శించారు. ఈ సందర్భంగా పారమిత పాఠశాలల చైర్మన్ డాక్టర్ ఈ ప్రసాదరావు మాట్లాడుతూ, సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, ఐక్యతను చాటేది ఈ రాఖీ పండగ అని పేర్కొన్నారు. పాఠశాల డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ మండలంలోని తుమ్మనపల్లి గ్రామ శివారులో గల ఏకశిలా సీబీఎస్ఈ పాఠశాలలో ముందస్తు రాఖీ వేడుకలకు చైర్మన్ గౌరు తిరుపతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థినులు ఆయనకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెట్లకూ రాఖీలు కట్టారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిదురాల దినేశ్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ దూడల నరేశ్, స్టాఫ్ ఇన్‌చార్జి శరత్ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హుజూరాబాద్ పట్టణంలోని అల్ఫోర్స్ జీనియస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌తోపాటు రామడుగు మండలం గోపాల్‌రావుపేటల